# ఎన్నికల ప్రచారం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం మొదటి లోక్‌సభ ఎన్నికలకు రాజు పక్షాన దిబ్బేశ్వర్లుంగారూ, రైతు పక్షాన దిబ్బనాయుడూ నిలబడ్డారు. వీళ్లు గాక ఇరవై తొమ్మిది మంది సొంతాన నిలబడి డిపాజిట్లు పోగొట్టుకున్నారు. వాళ్లు సోదిలోకి కూడా రారు.

కాని దిబ్బేశ్వర్లుంగారి ఎన్నికల ప్రచారం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. అది నల్లసిరాలో కూడా అచ్చుకాకపోవటం శోచనీయం. అప్పటికి ఇప్పటికి దిబ్బలో ఎన్నికల ప్రచారం అట్టే మారలేదు. గనుక వాని వివరాలు కొంతమందికైనా ఆసక్తికరంగా ఉండవచ్చు.

దిబ్బేశ్వర్లుంగారి మీటింగుకు నూట అయిదుగురు వచ్చారు. అందులో ఎనభై తొమ్మిది మంది వారి బలగమే. శ్రీవారు మైక్‌ముందు తప్పతాగి వచ్చాడని గొప్పగా చెప్పుకున్నారు. అదొక పెద్ద ఆకర్షణ అయింది.

"మహా జనులారా!" అని మొదలుపెట్టి వారు చాలాసేపు తమ గొప్పతనం చెప్పుకున్నారు. ఆ తరవాత అకస్మాత్తుగా వారికి ఎన్నికల మాట గుర్తొచ్చింది.

"మీ వోటెవరికిస్తారు? రావణాసురికిస్తారా? కుంభకర్ణుడికిస్తారా? వాళ్లు దుర్మార్గులు, నీచులు, రాక్షసులు, నీతి జాతీ లేనివాళ్లు. రాముడంటే ఎంత గొప్ప వాడు! ఆ రాముడి పెళ్లాన్ని ఎత్తుకుపోయినవాణ్ని ఎంత బుద్ధి తక్కువ్వాడనాలి? వాణ్ని పగలగోసినా పాపం లేదు! కొరతేసినా తప్పులేదు! ఊరికే చంపేయటం కాదు. అలాటి వాణ్ని కత్తికి కండలుకోసి, ఉప్పు, కారం రాయాలి..."

శ్రీవారికి ఆవేశం ఎక్కువై, నోటంట నురుగులు వచ్చి మూర్ఛపోయారు. ఆయన మనుషులు ఆయన చేత సీసాతో ఏదో తాగించి, స్పృహ తెప్పించినాక ఆయన, "అందుచేతేవిటంటే మీరంతా నాకే వోటు చెయ్యండి" అని వేదిక దిగిపోయారు.

"వోట్లన్నీ ఆయనకే బడ్డాయి."

***ముద్రణ : యువ, జూలై 1977***